సాక్షి తిరుపతి

ఆదివారం । 4 । మే । 2025



అమ్మో..వచ్చేశాయ్!

రైల్వేట్రాక్ దాటి వచ్చి పంట పొలాలను ఏనుగుల మంద నాశనం చేసినట్టు మామండూరు వాసులు పేర్కొన్నారు. - IIలో



ఎస్వీయూలో కొత్త కోర్సులు

ఎస్వీ యూనివర్సిటీలో ఎట్టకేలకు కొత్త కోర్సులకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు బ్రోచర్‌ను విడుదల చేశారు. - IIలో



పథకం ప్రకారమే హత్య

ఓజిలి మండలం, అత్తివరం గ్రామానికి చెందిన గురుమూర్తిని పథకం ప్రకారమే ప్రత్యర్థులు హత్య చేసినట్టు పోలీసులు తెలిపారు. - IIలో

న్యూస్‌రీల్

6న ఎస్వీయూలో జాబ్‌మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో ఈ నెల 6వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టీ శ్రీనివాసులు తెలిపారు. చెన్నై, బెంగళూరు, తిరుపతికి చెందిన ఎమ్ఎన్‌సీ కంపెనీలు సుమారు 130 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9533889902, 7989810194 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రశాంతంగా ఏపీపీఎస్సీ పరీక్షలు



ఎస్వీయూనివర్సిటీలో పరీక్షల సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: నగరంలో ఏపీపీఎస్సీ పరీక్షలు శనివారం ప్రశాంతంగా సాగాయి. నగరంలోని మూడు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా.. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రకాశం భవన్‌లో జరుగుతున్న పరీక్షలను కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్ష నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. న్యూబాలాజీ కాలనీలోని ఎస్‌డీహెచ్‌ఆర్ జూనియర్ కళాశాల, కేటీ రోడ్డులోని లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్, ఎస్వీయూనివర్సిటీ పరిధిలోని ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్‌లో పరీక్షలకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టారు. మొత్తం 911 మంది అభ్యర్థులకుగాను 623 మంది మాత్రమే హాజరైనారు.

భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

తిరుపతి అర్బన్: పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు విధిగా పాటించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. శనివారం పరిశ్రమల విభాగానికి చెందిన అధికారులతో ఆయన కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వ్యాపారాలు ఎంత ముఖ్యమో అంతకు మించి కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలన్నారు. అలాగే కొత్త పరిశ్రమల స్థాపన సందర్భంగా ఉద్యోగ అవకాశాలు స్థానికులకే అధిక ప్రాధాన్యత కల్పించాలని స్పష్టం చేశారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి కేపీ.సుధాకర్, జోనల్ మేనేజర్ ఏపీఐఐసీ తిరుపతి విజయభరత్‌రెడ్డి, జోనల్ మేనేజర్ తిరుపతి స్పెషల్ ప్రాజెక్ట్ జోస్ యల్.శివకుమార్, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ రామకృష్ణారెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య, సంఘిక సంక్షేమశాఖా ధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, ఆర్‌టీఓ మురళీమోహన్ పాల్గొన్నారు.

మితిమీరుతున్న కూటమి అరాచకాలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగా నడుస్తోందని, కూటమి అరాచకాలకు అంతేలేకుండా పోతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొన్న పుష్కరాలు, నిన్న తిరుపతిలో శ్రీవారి భక్తులు, నేడు సింహాచలం దుర్ఘటన కూటమి పాలన నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. సింహాచలం ఘటనలో ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం శోచనీయమన్నారు. అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అరాచకాలకు ఒడిగట్టడం బాధాకరమన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డీ.రంగయ్య, వైఎస్సార్‌సీపీ నేత చెలికం దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.

సంతృప్తికరంగా లక్ష్మీనరసింహుడి దర్శనం



మాట్లాడుతున్న ఆనంరామనారాయణరెడ్డి

రాపూరు: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, రాపూరు మండలంలోని పెంచలకోనలో ఈనెల 8 నుంచి 14వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో ప్రతి ఒక్క భక్తుడూ సంతృప్తిగా శ్రీపెనుశిల లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకునేలా ఏర్పాటు చేపట్టనున్నట్టు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. రాపూరు మండలం, పెంచలకోనలో శనివారం బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలసి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో గరుడసేవ, కల్యాణోత్సవం రోజుల్లో ఎన్నడూ లేని విధంగా ప్రతి ఒక్కరికీ ఉచిత లడ్డూ అందించాలని ఆదేశించారు. నెల్లూరు ఆర్డీఓ అనూషా, ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, దేవదాయశాఖ ఏసీ జనార్దన్‌రెడ్డి, దేవస్థాన ఏసీ శ్రీనివాసులురెడ్డి, పాలకవర్గ సభ్యులు చెన్ను తిరుపాల్‌రెడ్డి, దేవస్థాన ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి పాల్గొన్నారు. అనంతరం మంత్రి శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు.

'నేనింతే..! నియంతనంతే.. నాకే అడ్డు చెబుతారా..? మీ అంతు చూస్తా..!' నంటూ శ్రీకాళహస్తికి చెందిన ఓ ఎమ్మెల్యే చెలరేగిపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తన వ్యతిరేక వర్గీయులనే లక్ష్యంగా ఎంచుకుని కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన వారినీ వేధిస్తూ రాక్షసానందం పొందుతున్నారు. ఇది చాలదన్నట్టు పత్రికా విలేకరులపైనా దాడులు చేయిస్తూ శునకానందం పొందుతున్నారు.

నేనింతే!



శ్రీకాళహస్తిలో.. నియంత పాలన

- ఆ ఎమ్మెల్యే చెప్పినట్టు నడవాల్సిందే
- పోలీసులైనా, అధికారులు, విలేకరులైనా సరే
- ఎమ్మెల్యే ఫ్లెక్సీ తప్ప మరొకరి ఫ్లెక్సీ కనిపించకూడదు
- కూటమి నేతకు వ్యతిరేకంగా ఏ ఒక్కరూ ప్రెస్‌మీట్లు పెట్టకూడదు
- జర్నలిస్టు సంఘాలు ఉన్నా విలేకరులంతా టీడీపీ నేత కనుసన్నల్లోనే



రేణిగుంట మండలం: పేదల గృహాలను యంత్రాలతో ధ్వంసం చేస్తున్న దృశ్యం(ఫైల్)

సాక్షి, టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శ్రీకాళహస్తి నియోజకవర్గ పాలన అస్తవ్యస్తంగా మారింది. స్థానికంగా ఉన్న ఒక ఎమ్మెల్యే తనకు వ్యతిరేకం అనుకున్న వారందరినీ లక్ష్యంగా చేసుకుని విరుచుకుపడుతున్నారు. ఇప్పటికే శ్రీకాళహస్తి పట్టణ పరిధిలోని అనేక నివాసాలను జేసీబీలతో కూల్చేశారు. ముఖ్యంగా రాజీవ్‌నగర్ పరిధిలోనే పేదలు నిర్మించుకున్న పక్కాగృహాలను నిర్దాక్షిణ్యంగా పడగొట్టేశారు. ఆ తర్వాత రేణిగుంట, తొట్టంబేడు, ఏర్పేడు మండలాల పరిధిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు నిర్మించుకున్న నిర్మాణాలను లక్ష్యంగా చేసుకుని చెలరేగిపోయారు. నివాసాలు నిర్మించుకున్న వారందరికీ విద్యుత్ కనెక్షన్, ఇంటి పన్నులు ఉన్నాయని చెప్పినా వినకుండా కూల్చివేయించారు. 'నేను చెప్పినట్లు చెయ్యండి.. లేదంటే బదిలీపై వెళ్లిపోండి.. లేకుంటే నేనే పంపించేస్తా' నంటూ అధికారులపై బెదిరింపులకు దిగుతున్నారు. టీడీపీ నేత నియంత పాలనకు నిదర్శనం మచ్చుకు కొన్ని ఘటనలు..

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు

శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ స్థానికంగా ఉన్న ఒక ఎమ్మెల్యే కనుసన్నల్లోనే సాగుతోంది. ప్రముఖ దినపత్రికల్లో ఉన్న జర్నలిస్టులకు అందులో సభ్యత్వం లేదు. నియోజకవర్గ ముఖ్యనేత చెప్పినవారే కార్యవర్గ సభ్యులు. ఇదేగాక ఆ టీడీపీ నేతకు వ్యతిరేకంగా ప్రెస్ మీట్లు ఎవ్వరూ పెట్టకూడదు. అందుకే కొందరు తిరుపతికి వచ్చి ప్రెస్‌మీట్ పెట్టి శ్రీకాళహస్తిలోని టీడీపీ నేత చేస్తున్న అరాచకాలపై ధ్వజమెత్తుతున్నారు.

స్పందించరే!

తోటి జర్నలిస్ట్‌పై దాడి జరిగితే రాష్ట్రంలోని ఆ సంఘం నేతలు ఖండించడంతో పాటు స్థానికంగా ఉన్న వారంతా నిరసనలు తెలియజేస్తారు. తిరుపతి, చిత్తూరు జిల్లా కేంద్రాల్లోని జర్నలిస్ట్ సంఘాలు స్పందించినా.. శ్రీకాళహస్తిలోని జర్నలిస్టులు ఖండిండానికి వీల్లేకుండా టీడీపీ నేతలు బెదిరించినట్లు తెలిసింది. అందుకే ఆ రోజు శ్రీకాళహస్తిలోని ఏ ఒక్క జర్నలిస్ట్ ధైర్యంగా దాడిని ఖండించలేకపోయారు. కనీసం పరామర్శకు కూడా రానివ్వకుండా టీడీపీ నేత అడ్డుకున్నారు.

షికారీలపైనా ప్రతాపం

శ్రీకాళహస్తి మండలం, ఎంపేడు పంచాయతీ ఈశ్వరయ్యకాలనీకి చెందిన షికారీలు రెండు నెలలుగా ఒడిశా రాష్ట్రానికి వెళ్లి పోయారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటేశారన్న అక్కసుతో గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వారిని వెళ్లగొట్టారు. గత ఏడాది జూన్ 7వ తేదీన 30 కుటుంబాలు గ్రామాన్ని విడిచిపెట్టి పిల్లాపాపలతో వెళ్లిపోయారు. ఊరొదిలిన వెళ్లిన వారిలో గ్రామ సర్పంచ్ సుమతి కూడా ఉన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అరాచకాలు జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్రపోషిస్తున్నారు. కొందరు పోలీసులు అరాచకాలకు ఆజ్యం పోస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

అరాచకాలు భరించలేక ఊరొదిలి వెళ్లిపోయారు

శ్రీకాళహస్తి నియోజకవర్గం, తొట్టంబేడు మండలం, కొత్తకండ్రిగలో వైఎస్సార్‌సీపీకి ఓటువేశారని 15 కుటుంబాల వారి నివాసాల్లోకి టీడీపీ మూకలు దూరి దాడులకు తెగబడ్డారు. గేట్లు వేసి చేతులెత్తి దండంపెడుతున్నా వినకుండా చావబాదారు. గేట్లు విరగ్గొట్టుకుని లోనికి దూరి విచక్షణారహితంగా దాడులు చేశారు. తీవ్రంగా గాయపడ్డ బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. టీడీపీ నేతల ఒత్తిళ్లతో తిరిగి బాధితులపైనే 307 సెక్షన్ కేసు నమోదు చేశారు. దాడికి తెగబడిన వారిపై మాత్రం పిట్టీ కేసుపెట్టి చేతులు దులుపుకున్నారు. టీడీపీ నేతల దాష్టీకానికి భయపడి 15 కుటుంబాల వారు ఊరొదిలి వెళ్లిపోయారు. ఇప్పటికీ ఎక్కడున్నారో తెలియని పరిస్థితి.

శ్రీకాళహస్తి : హోటల్ రివర్ ముఖద్వారం ధ్వంసం



జర్నలిస్టులపై జులుం

శ్రీకాళహస్తిలో ఐదు రోజుల క్రితం కూటమి నేతల మధ్య చెలరేగిన ఫ్లెక్సీల వివాదాన్ని చిత్రీకరిస్తున్న ఓ విలేకరిపై టీడీపీ గూండాలు దాడిచేశారు. తనపై దాడిచేశారని పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళ్లగా అక్కడా దాడికి తెగబడ్డారు. ఆ విలేకరికి సాక్షి విలేకరి శ్రీనివాసులు మద్దతుగా నిలిచారని 15 మందికిపైగా టీడీపీ గూండాలు మద్యం మత్తులో హత్యచేయాలని కుట్రపన్నారు. అందులో భాగంగా ఆ రాత్రి 11 గంటల సమయంలో నివాసానికి వెళ్తున్న సాక్షి విలేకరిపై విచక్షణారహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు.

ఆశలు దహనం

శ్రీకాళహస్తి మండలం, ఇనగలూరు సర్పంచ్ చెలికం నాగరాజురెడ్డికి చెందిన రూ.10 లక్షల విలువైన 100 టన్నుల టేకు కొయ్యలను గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టారు. పక్కనే ఉన్న ఓ కల్లు దుకాణానికి నిప్పు పెట్టారు. టీడీపీ శ్రేణులే తనను ఆర్థికంగా దెబ్బతీసేందుకు వీటిని తగులబెట్టారని బాధితుడు ఆరోపించారు. విషయం తెలుసుకున్న తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సర్పంచ్‌లు.. ఎంపీటీసీలపైనా ప్రతాపం



కూటమి ప్రభుత్వం వచ్చాక శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలను వేధింపులకు గురిచేయడం ప్రారంభించారు. బిల్లులు మంజూరు చేయొద్దని ఎంపీడీఓలకు ఆదేశాలు జారీచేశారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లందరిచీ చెక్ పవర్ రద్దుచెయ్యమని హుకుం జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. విషయం తెలుసుకున్న సర్పంచ్‌లు టీడీపీ నేత తీరును తీవ్రంగా తప్పుబడుతూ.. మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే వస్తే తాము హాజరు కాలేమని అధికారులకు తేల్చిచెప్పారు.

నేడే నీట్

- తిరుపతిలో 9, గూడూరులో ఒక పరీక్షా కేంద్రం
- హాజరుకానున్న 4,476 మంది విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్ : వైద్యవృత్తి కోర్సుల్లో ప్రవేశాలకు ఏటా ఎన్‌టీఏ ఆధ్వర్యంలో నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్టు(నీట్-2025)ను ఆఫ్‌లైన్ (పెన్ను, పేపరు) విధానంలో ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు నిర్వహించనుంది. దీనికోసం తిరుపతి జిల్లాలో 10 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేసింది. ఇందులో 9 తిరుపతిలో కాగా, గూడూరులో ఒక పరీక్ష కేంద్రాన్ని కేటాయించింది. మొత్తం 10 పరీక్షా కేంద్రాల్లో 4,476 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

మధ్యాహ్నం 1.30 గంటల వరకే అనుమతి

మధ్యాహ్నం 2 నుంచి ప్రారంభమయ్యే నీట్ పరీక్ష కు హాజరయ్యే అభ్యర్థులను వారికి కేటాయించిన కేంద్రాల్లోకి ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకే అనుమతించనున్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తప్పనిసరిగా అడ్మిట్ కార్డుతో పాటు ఒరిజినల్ ఆధార్ కార్డును వెంట తీసుకెళ్లాలి. అలాగే విద్యార్థులు ఫుల్ హ్యాండు షర్టు, పెద్ద బటన్లు కలిగిన షర్టులు, జీన్స్ ప్యాంటు, టీ షర్టు ధరించకూడదు. విద్యార్థినులు చుడిదార్ బట్టలను ధరించాలి. స్లీవ్‌లెస్ బట్టలు ధరించకూడదు. ఎలక్ట్రానిక్స్ పరికరాలు, చేతి గడియారాలు, లోహాలతో తయారు చేసిన ఆభరణాలను అనుమతించరు. విద్యార్థులు బూట్లు కాకుండా స్లిప్పర్స్, శాండిల్స్‌ను మాత్రమే వేసుకోవాలి. పరీక్షకు అవసరమైన ప్రశ్నాపత్రం, రెండు ఓఎమ్మార్ షీట్లు, బుక్‌లెట్, పెన్నుతో కూడిన ఓ ప్యాకెట్‌ను ఎన్‌టీఏ అందించనుంది.

తిరుపతిలో పరీక్షా కేంద్రాలివే

1. శ్రీపద్మావతి బాలికల హైస్కూల్, వెస్ట్ చర్చ్ రోడ్డు, బాలాజీ కాలనీ
2. కేంద్రీయ విద్యాలయ నెం.1, హరే రామ హరే కృష్ణ రోడ్డు, ఎంసీఆర్ కాలనీ
3. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం(ఎస్‌పీడబ్ల్యూ ఉమెన్స్ యూనివర్సిటీ), ఎగ్జామినేషన్ హాల్, పద్మావతీ నగర్
4. ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల (అటానమస్), లక్ష్మీపురం సర్కిల్, తిరుచానూరు రోడ్డు
5. శ్రీపద్మావతి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల (టీటీడీ) వింగ్-ఏ, పద్మావతీ గెస్ట్ హౌస్ సమీపం
6. శ్రీపద్మావతి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల (టీటీడీ) వింగ్-బీ, పద్మావతీ గెస్ట్ హౌస్ సమీపం
7. శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ క్యాంపస్ హైస్కూల్, వెస్ట్ చర్చ్ రోడ్డు, బాలాజీ కాలనీ
8. శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాల (టీటీడీ), సంస్కృత విద్యాపీఠం సమీపం, ఎల్‌బీసీ రోడ్డు, బాలాజీ కాలనీ
9. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల (టీటీడీ) వింగ్-ఏ, వింగ్-బీ, బాలాజీ కాలనీ

గూడూరులో..

1. డీఆర్‌డబ్ల్యూ జూనియర్ కళాశాల, జెడ్పీ హైస్కూల్ రోడ్డు

తీరంలో అలజడి



తీర గ్రామాల్లో కమ్ముకున్న కారు మబ్బులు

వాకాడు: వాతావరణంలో గత నాలుగు రోజులుగా చోటుచేసుకుంటున్న పలు మార్పుల కారణంగా శనివారం వాకాడు మండలం, తూపిలిపాళెం సముద్ర తీరంలో ఈదురు గాలులతోపాటు అలజడి ఏర్పడింది. సముద్రంలో సాధారణ సమయాల్లో కన్నా ప్రస్తుతం అలల ఉధృతి బాగా పెరిగింది. గత రెండు వారాలుగా వేసవి సెలవులు కావడంతో బీచ్‌కి పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు. నల్లని కారుమబ్బులు, ఈదురు గాలులు, అలల ఉధృతి కారణంగా తీరంలో ఇసుక రవ్వలు మొహంపై పడుతుండడంతో పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే ప్రస్తుతం వేట విరామం కొనసాగుతుండడంతో మత్స్యకారులు అందరూ ఇంటికే పరిమితమయ్యారు.



తూపిలిపాళెం బీచ్‌లో అలల ఉధృతి

హామీలు అదృశ్యం..అక్రమాలు ఖనిజం!

- ఖనిజ సంపదను దోచుకుంటున్న కూటమి నేతలు
- ఎన్నికల ముందు ఇచ్చిన ఒక్క హామీనీ నెరవేర్చలేదు
- ప్రజలను మోసం చేయడమే బాబు నైజం
- రాష్ట్ర ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగిన నేదురుమల్లి



సైదాపురం మండలంలో అక్రమ మైనింగ్ ఫొటో చూపిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం: సంపద సృష్టి పేరుతో కూటమి నాయకులు స్కామ్‌లకు పాల్పడుతున్నారని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. నెల్లూరులోని నేదురుమల్లి కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. ప్రతి వలంటీర్ కొనసాగుతారని, వారికి నెలకు రూ.10 వేలు ఇస్తామని ఎన్నికల ముందు హామీలిచ్చి గద్దెనెక్కాక మిన్నకుండిపోయారని విమర్శించారు. పైగా రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షల మంది వలంటీర్లను తొలగించారని చెప్పారు. విజయవాడ వరద సమయంలో వలంటీర్ల వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడిందన్నారు. ఈ మేరకు వలంటీర్ల వ్యవస్థను పునఃప్రారంభించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పైలెట్ నియోజకవర్గంగా వెంకటగిరిని ఎంపిక చేశారని చెప్పారు. దీనికి నాగార్జున యాదవ్ ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నట్లు పేర్కొన్నారు.

వెంకటగిరి నియోజకవర్గంలో అక్రమాల జోరు

వెంకటగిరి నియోజకవర్గంలో అక్రమాలు జోరుగా సాగుతున్నాయని నేదురుమల్లి ఆరోపించారు. పోలీస్ స్టేషన్‌లలోనే కేసులు విచారణ, తీర్పులు జరుగుతున్నాయని చెప్పారు. నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు లాక్కోవడం, ఇసుక కనిపిస్తే దోచుకోవడం, పక్క రాష్ట్రాలకు తరలించడం రివాజుగా మారుతోందన్నారు. కలువాయి మండలంలో తెలుగు రాయపురం, రాజుపాళెం వద్ద అక్రమంగా ఇసుక రీచ్‌లు, రోడ్లు ఏర్పాటు చేసి ఇసుకను తరలిస్తున్నారని తెలిపారు. ఇసుక మొత్తం బెంగుళూరుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిపారు. సైదాపురం మండలంలో క్వార్ట్జ్ అక్రమ మైనింగ్‌పై ఓ సినిమా తీయొచ్చని చెప్పారు. అధికారికంగా మైన్స్ ఉన్న వారిని బెదిరించి 50 శాతం వాటా తమకే ఇవ్వాలని, లేదంటే మైన్‌లు మొత్తం తమకే ఇస్తే వ్యాపారం చేసి 50 శాతం వాటా తామే ఇస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారని తెలిపారు. ఫిని క్వార్ట్జ్ ప్రైవేటీ లిమిటెడ్ ఈ ఏడాది జనవరి 25న మన్నెమాల విజయకుమార్‌రెడ్డి, ఎండీగా మేకా రవింద్రబాబు, ముళ్లపూడి ప్రభాకర్‌రావు, వీర్రాజు మావూరి డైరెక్టర్లుగా ఒక కంపెనీ స్థాపించారన్నారు. నంబర్ ప్లేట్స్ లేని వాహనాలను వాడుతూ చెలరేగిపోతున్నారని తెలిపారు. అడవుల్లో కూడా అక్రమ మైనింగ్ చేస్తుంటే డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఎందుకు మౌనంగా ఉన్నట్లో అర్థం కావడంలేదన్నారు. కాకినాడలో సీజ్ ద షిప్ అన్న పవన్ సైదాపురంలో జరుగుతున్న అక్రమ మైన్స్ పై ఎందుకు మాట్లాడలేదో చెప్పాలన్నారు. అక్రమ మైనింగ్ వ్యవహారాలపై కలెక్టర్, ఎస్పీ దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. సంపద సృష్టి అంటే రాష్ట్రంలో ఉన్న అన్ని వనరులను దోచుకోవడమేనా..అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఒక్క రూపాయితో పురసా కంపెనీకి 60 ఎకరాలు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. మరో రెండేళ్లలో జమిలీ ఎన్నికలు వస్తాయని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోనే సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించబోతోందని పేర్కొన్నారు. సైదాపురం, రాపూరు, కలువాయి మండలాల కన్వీనర్లు మన్నారపు రవికుమార్‌యాదవ్, మధురెడ్డి, కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసులరాజు పాల్గొన్నారు.

తిరుపతిలో 8న జాబ్‌మేళా



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: తిరుపతిలో ఈ నెల 8న జరగుతున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లో నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులతో కలసి జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతిలోని గీతం స్కూల్, భవానీ నగర్ సర్కిల్‌లో జరగబోయే మెగా జాబ్‌మేళాకు శ్రీ సిటీ, మేనకూరు సెజ్, ఈఎంసీ క్లస్టర్, తిరుపతి, బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలోని 16 బహుళ జాతీయ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. 700 పైగా ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, లేదా పీజీలో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యేవారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, అదనపు సమాచారం కోసం 8143576866, 9177508279, 9988853335 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్.లోకనాథం, ప్రాజెక్ట్ డైరెక్టర్ డీఆర్‌డీఏ టీఎస్.శోభన్‌బాబు పాల్గొన్నారు.

గుడ్లు తేలేస్తున్న అంగన్‌వాడీలు!

- నాణ్యతలేని గుడ్లు సరఫరా
- కంపు కొడుతున్న కోడిగుడ్లు
- పట్టించుకోని అధికారులు

తిరుపతి అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాలకు అందిస్తున్న కోడిగుడ్లలో నాణ్యత కరువైంది. కంపు కొడుతున్న కోడిగుడ్లను సరఫరా చేస్తున్నా అధికారులు పట్టించుకోని పరిస్థితి నెలకొంది. జిల్లాలో పిల్లలతోపాటు గర్భిణులు, బాలింతలకు కోడి గుడ్లు అందిస్తున్న సంగతి తెలిసిందే. ఒక్కొక్కరికీ నెలకు 25 కోడి గుడ్లు ఇస్తున్నారు. ఈ లెక్కన జిల్లాలో నెలకు 26 లక్షల కోడిగుడ్లు సరఫరా చేస్తున్నారు. ఇంతపెద్ద ఎత్తున జరుగుతున్న కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాల్సిన అధికారులు గాలికొదిలేశారు. కొన్నిచోట్ల నాణ్యత లేని కోడిగుడ్లు సరఫరా చేస్తున్నారు. వీటిని నీటిలో వేస్తే తేలిపోతున్నాయని బాలింతలు, గర్భిణులు ఆరోపిస్తున్నారు.




చెన్నంపల్లి : నీటిలో తేలుతున్న గుడ్లు

చెన్నంపల్లిలో చెడిపోయిన కోడిగుడ్లు

ఏర్పేడు మండలం, చెన్నంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చెడిపోయిన కోడిగుడ్లు అందించారు. వీటిని నీళ్లల్లో వేస్తే తేలిపోతున్నాయి. దీనికితోడు సైజు కూడా చాలా చిన్నవిగా ఉంటోంది. వాటిని తీసుకోవడానికి లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

విచారణ చేస్తాం



జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలకు అందిస్తున్న కోడిగుడ్లపై విచారణ చేపడుతాం. అన్ని ప్రాజెక్టుల పరిధిల్లోని సీడీపీఓలకు పర్యావేక్షణపై స్పష్టమైన ఆదేశాలిస్తాం. నాణ్యత లేని గుడ్లు సరఫరా చేస్తే ఊరుకోం. ఆ మేరకు ఆదేశాలిస్తాం.

– వసంత బాయి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్

చెన్నంపల్లికి నాణ్యత లేని గుడ్లు వచ్చాయి

ఏర్పేడు మండలంలోని చెన్నంపల్లిలో నాణ్యతలేని కోడిగుడ్లు వచ్చాయని సూపర్‌వైజర్ చెప్పారు. ఆ అంగన్‌వాడీ స్కూల్‌కు గుడ్లు మార్పు చేసి...నాణ్యమైన గుడ్లు అందిస్తాం. ఎక్కడైనా అలాంటి గుడ్లు వస్తే వెంటనే అంగన్‌వాడీ వర్కర్లు సమాచారం ఇవ్వాలి.

– కృష్ణమంజరి, సీడీపీఓ, రేణిగుంట

సాక్షి రిపోర్టర్‌పై దాడి కేసు.. నిందితుల అరెస్ట్ ఎప్పుడు?


సీఎం చంద్రబాబుతో కోబాక లక్ష్మణ్ (ఫైల్)

రేణిగుంట: శ్రీకాళహస్తిలో గత నెల 28వ తేదీన శ్రీకాళహస్తి సాక్షి రిపోర్టర్ నెల్లూరు శ్రీనివాసులుపై దాడిచేసిన కేసులో ఇప్పటివరకు నిందితులను అరెస్ట్ చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. గతనెల 28వ తేదీ రాత్రి 10.30గంటల సమయంలో బహదూర్‌పేట నుంచి బైక్‌పై ఇంటికి వస్తున్న రిపోర్టర్ శ్రీనివాసులుపై పట్టణంలోని వీఎం పల్లికి చెందిన టీడీపీ యువజన విభాగం నాయకుడు కోబాక లక్ష్మణ్, అతని అనుచరులు 15 మంది కలసి దాడికి తెగబడ్డారు. ఈ ఘటనపై శ్రీకాళహస్తి టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో రిపోర్టర్ ఫిర్యాదు చేయగా, 126(2), 118(1) సెక్షన్లతో 29వ తేదీన కేసు నమోదు చేశారు. అయితే ఇప్పటి వరకు నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరచకపోవడం రాజకీయ ఒత్తిళ్ల ఎక్కువకావడం వల్లనే అని విమర్శలు వినిపిస్తున్నాయి. నిందితుల నుంచి తనకు ప్రాణహాని ఉందని, వారిని అరెస్ట్‌చేసి తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరుతున్నారు.

బీఈడీకి బీటెక్ విద్యార్థులు అర్హులే

తిరుపతి సిటీ: ఏపీలో ఈ ఏడాది నుంచి బీటెక్ పూర్తి చేసిన వారు సైతం బీఈడీ చేసే అవకాశం లభించింది. ఈ ఏడాది నాగార్జున వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఎడ్‌సెట్–2025 ప్రవేశ పరీక్షకు బీటెక్ చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఉపాధ్యాయులుగా రాణించాలనే యువ ఇంజినీర్లు ఎడ్‌సెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. బీటెక్ విద్యార్థులు గణితం, ఫిజికల్ సైన్స్, మెథడాలజీ విభాగాలలో బీఈడీ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఏపీ ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు చేసుకునేందుకు ఈ నెల 14వ తేదీ చివరి గడువు. ప్రవేశ పరీక్ష జూన్ 5వ తేదీ నిర్వహించనున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


టేబుల్ టెన్నిస్‌లో క్వార్టర్ ఫైనల్‌కు చేరిన వెటర్నరీ విద్యార్థినులు

చిల్లకూరు: జాతీయ స్థాయిలో జరిగే టేబుల్‌టెన్నిస్ పోటీలలో తిరుపతికి చెందిన శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వ విద్యాలయానికి చెందిన ముగ్గురు విద్యార్థినులు విశేష ప్రతిభ కనబరిచి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. అయోధ్యలో శనివారం జరిగిన టీటీ పోటీలలో నాల్గవ సంవత్సరం చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. ఇందులో చిల్లకూరు మండలం, వల్లిపేడుకు చెందిన పార్థివ క్రిష్ణ తోపాటుగా తూర్పుగోదావరి, గుజరాత్‌కు చెందిన హరిక, ఉద్యాతి మల్‌హోత్రా ఉన్నట్టు పేర్కొన్నారు.

పీఆర్‌లో అవినీతి అనకొండ!

- ప్రతి పనికీ 10 శాతం పర్సంటేజీ ఇవ్వాల్సిందే
- వైఎస్సార్‌సీపీ మద్దతు సర్పంచ్‌లే టార్గెట్
- పనులు చేసినా ఎంబుక్ చేయని వైనం
- డక్కిలి మండలంలో ఇదీ పరిస్థితి

సాక్షి, టాస్క్‌ఫోర్స్: వెంకటగిరి నియోజకవర్గం, డక్కిలి మండలానికి చెందిన పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి చెలరేగిపోతున్నారు. మండలంలో ఏ పని చేయాలన్నా ఆయనగారికి ముడుపులు ఇచ్చుకోవాల్సిందే. లేకుంటే బిల్లులు చేయరు. గట్టిగా అడిగితే టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారని, బిల్లలు చేయొద్దంటూ తనపై ఒత్తిడి చేస్తున్నారని బుకాయించడం షరామామూలైపోతోంది.

ప్రతి పనికీ పర్సెంటేజీ

మండలంలో ఏ పని చేసినా కొలతల పుస్తకం(మెజర్‌మెంట్ బుక్)తయారు కావాలంటే పీఆర్ ఏఈఈకి ఒక్కో పనికి 8 నుంచి 10 శాతం వరకు పర్సంటేజీలు ఇవ్వాల్సిందే. వైఎస్సార్‌సీపీ మద్దతు సర్పంచ్‌లనే టార్గెట్‌గా విధించుకుని వసూళ్ల పర్వానికి తెర లేపడం విమర్శలకు తావిస్తోంది. ఇటీవల మండంలోని అన్ని పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు జరిగాయి. ఈ రోడ్ల నిర్మాణాల్లో ఆ అధికారి చేతి వాటం ప్రదర్శించినట్టు తెలుస్తోంది. ఎంబుక్ చేయకపోతే బిల్లులు ఆలస్యమవుతాయని సంబంధిత కాంట్రాక్టర్లను బెదిరించి ముడుపులు తీసుకున్నట్టు సమాచారం. డక్కిలి మండలంలో రూ.2.5 కోట్ల మేర పనులు జరగ్గా .. సదరు అధికారికి అందులో పది శాతం మేర కమీషన్ ముట్టజెప్పినట్టు తెలుస్తోంది.


శ్రీపురం గ్రామంలో వీధిలైట్ల ఏర్పాటు (ఫైల్)

సర్పంచ్‌లకు తప్పని కష్టాలు

డక్కిలి మండలంలో సర్పంచ్‌లకు సైతం ఆ అధికారి చుక్కలు చూపిస్తున్నారు. అప్పు చేసి పనులు చేసినా బిల్లులు పెట్టకుండా వేధిస్తున్నట్టు తెలుస్తోంది. పనులు చేసే సమయంలో ఆ అధికారి కారులో వస్తారని, ఆయనకు డీజిల్ ఖర్చు కింద రూ.5 వేలు ముట్టజెప్పాలని పలువురు పేర్కొంటున్నారు. లేదంటే నాణ్యతా ప్రమాణాలు సరిగా లేవని ఎంబుక్ చేయరని చెబుతున్నారు.

నువ్వు చెబితే నేను చేయను!

ఇటీవల డక్కిలి మండల పరిషత్ కార్యాలయ మరమ్మతులకు అంచనాలు వేయాలని ఎంపీపీ కోరగా సదరు అధికారి ససేమిరా అన్నట్టు తెలిసింది. దీంతో ఎంపీపీ రాజశేఖర్ ఆయనపై మండిపడ్డారు. అయినా ఆ అధికారి లెక్క చేయకుండా 'నువ్వు చెబితే నేను చేయను.. ఏం చేసుకుంటావో చేసుకో' అంటూ ఖరాకండీగా చెప్పినట్టు తెలిసింది. పంచాయతీల్లో ప్రతి పాదనలు తయారు చేయలన్నా.. ఎంబుక్ నమోదు చేయలన్నా ఆయనగారికి పర్సంటేజీలు ఇవ్వాల్సిందే. నేరుగానే ఫోన్‌పే ద్వారా కంట్రాక్టర్ల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది.

అధికారి అవినీతికి ఇవే ఆధారాలు


పీఆర్ ఏఈఈకి ఫోన్‌పే ద్వారా పంపిన నగదు

- శ్రీపురం పంచాయతీలో గతేడాది గ్రావెల్ రోడ్డు నిర్మాణం కోసం పంచాయతీ ఆమోదం తీసుకుని సర్పంచ్ పనులు పూర్తి చేశారు. కానీ సదరు అధికారి ఇంతవరకు ఎంబుక్ చేయకుండా వేధింపులకు గురిచేస్తున్నారు. అదే పంచాయతీలో ఈ ఏడాది సంక్రాంతి సందర్భంగా రూ.1.5 లక్షలతో వీధి లైట్లు వేశారు. ఆ బిల్లులు కూడా ఇంతవరకు మంజూరు చేయలేదు.
- అదే పంచాయతీకి చెందిన ఓ కాంట్రాక్టర్ గత ఏడాది ఏప్రిల్ 11వ తేదీన రూ.40 వేలు, మళ్లీ ఫిబ్రవరి 2024న 5వ తేదీ రూ.14 వేలు, 2024 సెప్టంబర్ 22న రూ.10వేలు ఆ అధికారికి ఫోన్‌పే ద్వారా చెల్లించారు.

బిల్లులు రాకుండా వేధిస్తున్నారు



"గత ఏడాది కిందట చేసిన పనులకు నేటి వరకు ఎంబుక్ చేయకుండా ఏఈఈ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అప్పు చేసి పనులు పూర్తి చేసినా బిల్లులు పెట్టడంలేదు. ఆయనకు లంచం ఇవ్వందే పనులు చేయడం లేదు. ప్రతి పనికీ పది పర్సెంటేజ్ అడుగుతున్నారు. లేకుంటే టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారని బుకాయిస్తున్నారు. – నక్కా పెంచలరత్నమ్మ, శ్రీపురం పంచాయతీ సర్పంచ్

అలాంటి సమస్యలు నా దృష్టికి రాలేదు

మండలంలో సర్పంచ్‌లను ఎవరినైనా ఇబ్బందులకు గురిచేస్తే నేరుగా నన్ను సంప్రదిస్తే సమస్య పరిష్కరిస్తా. 10 శాతం ముడుపులు తీసుకుంటున్నారని ఎవ్వరూ నా దృష్టికి తీసుకురాలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు తీసుకుంటాం. – లక్ష్మీనారాయణ, పీఆర్ డీఈఈ, వెంకటగిరి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలో చోటు

చిత్తూరు అర్బన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అనుబంధ కమిటీలో ఉమ్మడి జిల్లాలోని పలువురికి చోటు కల్పిస్తూ..పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటనను విడుదల చేసింది. చంద్రగిరికి చెందిన అన్వర్ బాషాను, శ్రీకాళహస్తికి చెందిన మహ్మద్ రసూల్‌ను రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శులుగా, నగరికి చెందిన మోహన్‌రెడ్డిని రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శిగా, చంద్రగిరికి చెందిన నాగేనమ్మను రాష్ట్ర అంగన్‌వాడీ విభాగ కార్యదర్శిగా, నగరికి చెందిన గోపాల్‌రెడ్డిని రాష్ట్ర ఎంప్లాయిస్, పెన్షన్ విభాగ సహాయ కార్యదర్శిగా నియమిస్తున్నట్లు కేంద్ర పార్టీ కార్యాలయం ప్రకటనలో పేర్కొంది.

పథకం ప్రకారమే గురుమూర్తి హత్య

నాయుడుపేట టౌన్: ఓజిలి మండలం, అత్తివరం గ్రామానికి చెందిన ఎల్లు గురుమూర్తి(52)ని పథకం ప్రకారమే హత్య చేసినట్లు నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. అశోక్ లేలాండ్ దోస్తు వాహనంతో ఢీకొట్టించి, ఆపై అతన్ని సుమారు కిలోమీటర్ల వరకు లాక్కెళ్లి దారుణంగా హత్య చేసినట్లు పేర్కొన్నారు. నాయుడుపేట పోలీస్ డివిజన్ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఈ కేసులో అరెస్టు చేసిన నలుగురు నిందితులను హాజరుపరిచారు. ఇందులో అతని ప్రత్యర్థులుగా ఉన్న అదే గ్రామానికి చెందిన మల్లి చందు, మల్లి శ్రీనివాసులు, మల్లి శరత్, వారి సమీప బంధువైన నెల్లూరు పట్టణానికి చెందిన యలమల సాయిని గూడూరు–చిల్లకూరు రహదారి వద్ద ఉండగా పట్టుకున్నట్లు డీఎస్పీ వివరించారు. ఈ కేసులో ఇంకా నిందితుల ఉన్నారని తెలిపారు. హత్య చేసేందుకు వినియోగించిన దోస్తు వాహనంతో పాటు ఓ మోటార్ సైకిల్, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

ఎస్వీయూలో కొత్త కోర్సులు షురూ

తిరుపతి సిటీ: ఎస్వీయూ, యూఎస్ఏకి చెందిన ఎక్సాప్లుయెన్స్ ఇంక్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఏడాది నూతన కోర్సులను ప్రారంభించనున్నారు. ఈ మేరకు శనివారం వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, ప్రిన్సిపల్ నరసయ్య కోర్సులకు సంబంధించిన ప్రత్యేక బ్రౌచర్‌ను విడుదల చేశారు. ఆధునిక పోటీ ప్రపంచంలో విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పించడమే ప్రధాన లక్ష్యంగా వర్సిటీలో నూతన కోర్సులను ప్రవేశపెట్టినట్టు వీసీ అప్పారావు తెలిపారు. పారిశ్రామిక రంగం కొత్త పుంతలు తొక్కుతున్న నేపథ్యంతో ఏఐ, డేటా సైన్స్ కోర్సులకు డిమాండ్ ఉందన్నారు.

అర్హతలు

ఎస్వీయూలో ఈ ఏడాది నూతనంగా ప్రారంభిస్తున్న ఎమ్ఎస్ డేటా సైన్స్, పీజీ డిప్లొమో, సర్టిఫికెట్ కోర్సులకు సంబంధించి ఏదేని గుర్తింపు పొందిన సంస్థ, యూనివర్సిటీ నుంచి బీటెక్ కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, ఐటీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు అర్హులు. అలాగే బీసీఏ, బీఎస్సీ పూర్తి చేసిన విద్యార్థులు కూడా అర్హులే. ఆసక్తిగల అభ్యర్థులుదరఖాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం ఎస్వీయూ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రందించాలి. మరిన్ని వివరాలకు 7396866627 నంబర్‌లో సంప్రదించొచ్చు.

ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు అభినందన

డేటా సైన్స్ కోర్సును పూర్తి చేసిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు తెలిపారు. ఎస్వీయూలో డేటా సైన్స్ కోర్సు పూర్తి చేసి షార్, ఎన్ఏఆర్ఎల్, వీఎస్‌సీసీ లాంటి సంస్థల్లో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను శనివారం తన చాం వీసీ ప్రత్యేకంగా అభినందించారు. వర్సిటీ నుంచి ఏడుగురు విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌కు ఎంపికకాగా ఇందులో షార్‌లో ప్రభాస్‌రాజ్, వీఎస్‌సీసీ సంస్థలో వీ.కుమార్, ఎన్ఏఆర్ఎల్‌లో వినయ్, ఎం.వ, నవ్య నిఖిత, సుమంత్, కీర్తి ఎంపికయ్యారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పీవీ నరసయ్య, హెడ్ అండ్ కో–ఆర్డినేటర్ అంజన్‌బాబు, టీఎస్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

నూతన కోర్సుల వివరాలు

కోర్సు	కాలవ్యవధి	రిజిస్ట్రేషన్‌కు చివరి గడువు
ఎమ్ఎస్ డేటా సైన్స్	రెండేళ్లు	ఈ నెల 24
పీజీ డిప్లొమో ఇన్ డేటా సైన్స్	ఏడాది	జూన్ 7
సర్టిఫికెట్ ఇన్ పైథాన్ ఫర్ ఏఐ, ఎంఎల్	ఆరు నెలలు	జూన్ 7
సర్టిఫికెట్ ఇన్ డేటా విజువలైజేషన్	ఆరు నెలలు	జూన్ 7
సర్టిఫికెట్ ఇన్ క్లౌడ్ టెక్నాలజీస్	ఆరు నెలలు	జూన్ 7

విలీనంపై నిరసన



దళితవాడలోని పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

చిల్లకూరు: కూటమి ప్రభుత్వం చేపట్టిన నూతన విద్యావిధానంతో తల్లిదండ్రులు, పిల్లలు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. ప్రాథమిక పాఠశాలల్లోని 3 నుంచి 5వ తరగతి వరకు ఉన్న పిల్లలను సమీపంలోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విలీనం చేసేందుకు నిర్ణయించారు. దీనికారణంగా పిల్లలు సుదరూ ప్రాంతాల్లోని పాఠశాలలకు వెళ్లలేక ముప్పుతిప్పలు పడాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఇలాంటిదే మండలంలోని తమ్మినపట్నం పంచాయతీలో చోటుచేసుకుంది. శనివారం గ్రామ సర్పంచ్ నెల్లిపూడి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పాఠశాల విలీనంపై నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని తమ్మినపట్నం పంచాయతీలోని గుమ్మళ్లదిబ్బలో ప్రాథమికోన్నత, కొత్తూరులో ఒక ప్రాథమిక పాఠశాల, తమ్మినపట్నం గ్రామంలో మరొక ప్రాథమిక పాఠశాల, తమ్మినపట్నం దళితవాడలో ఒక ప్రాథమిక పాఠశాల ఉన్నాయన్నారు. దళితవాడలోని ప్రాథమిక పాఠశాలలో 1–5వ తరగతి వరకు 40 మంది విద్యార్థులు ఉండగా.. అందులో 3–5వ తరగతి వరకు 20 మంది పిల్లలున్నట్టు పేర్కొన్నారు. వీరందర్నీ గుమ్మళ్లదిబ్బలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేసి, అందులో విలీనం చేసేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. కానీ దళితవాడ నుంచి గుమ్మళ్లదిబ్బ సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉండడం, ఆ మార్గమధ్యంలో నిత్యం పోర్టుకు వెళ్లే వాహనాలు తిరుగుతుండడంతో అంతదూరం తమ పిల్లలు వెళ్లలేరని తేల్చిచెప్పారు. స్థానికంగానే పాఠశాల కొనసాగేలా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

నువ్వా..నేనా?

– టెండర్లు దక్కించుకోవడానికి కూటమి నేతల కుమ్ములాటలు

తిరుపతి అర్బన్: పంచాయతీరాజ్‌కు చెందిన పనులు దక్కించుకోవడానికి కూటమి నేతలు నువ్వా..నేనా అన్నట్టు పోటీ పడుతున్నారు. తాము వేసిన చోట టీడీపీ నేతలు వేయరాదని జనసేన నేతలు మంతనాలు జరుపుతున్నారు. అన్నింటిలోనూ తమకు అవకాశాలు ఉండాలని బీజేపీ నేతలు పట్టుబడుతున్నారు. తిరుపతి మినహా మిగిలిన చోట్ల టీడీపీ నేతలు హవానే కొనసాగుతోంది. బీజేపీ, జనసేనా పార్టీలకు పదవులు, రుణాలు, టెండర్లు ఇవ్వడానికి సుముఖత చూపడం లేదన్న చర్చ జిల్లాలో జోరుగా సాగుతోంది.

నియోజక వర్గం	పనుల సంఖ్య	కిలో మీటర్లు	నిధులు రూ.కోట్లలో
చంద్రగిరి	4	7.89	3.20
శ్రీకాళహస్తి	6	11.10	3.09
సత్యవేడు	1	4.67	2.34
నగరి	3	8.83	3.08
గూడూరు	2	9.40	3.00
సూళ్లూరుపేట	4	8.98	3.14
వెంకటగిరి	2	6.48	3.20
	22	57.35	20.96

అమ్మో..వచ్చేశాయ్!

- ఏనుగుల వరుస దాడులు
- బెంబేలెత్తుతున్న ప్రజలు
- రైల్వే ట్రాక్ దాటి వచ్చిన ఏనుగుల మంద

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): ఇన్ని రోజులు రైల్వే ట్రాక్ అడ్డుగా ఉండడంతో తమకేమీ కాదనే ధీమాతో బతికేశారు. ఇప్పుడు ఏనుగుల మంద రైల్వే ట్రాక్ దాటి వచ్చి పంట పొలాలను నాశనం చేసి..మళ్లీ అడవిలోకి వెళ్లిపోవడంతో మామండూరు వణికిపోతున్నారు. రేణిగుంట మండలం, మామండూరు గ్రామం శేషాచల అడవి మధ్యలో ఉంది. కడప– తిరుపతి ప్రధాన రోడ్డు మార్గం, ప్రధాన రైల్వే మార్గం పక్కన ఈ గ్రామం ఉంది. రైల్వే ట్రాక్‌కు మరోవైపు ఉన్న మామిడి తోటలపై ప్రతి సంవత్సరం ఏనుగులు దాడులు చేసేవి. గతంలో ఎప్పుడూ రైల్వే ట్రాక్ దాటి వచ్చిన సందర్భాలు లేవు. శనివారం తెల్లవారుజామున ఏనుగుల మంద రైల్వే ట్రాక్ దాటుకొని వచ్చి పంట పొలాలను ధ్వంసం చేసి.. మళ్లీ రైల్వే ట్రాక్ దాటి శేషాచల అడవిలోకి వెళ్లాయి. రైల్వే ట్రాక్ దాటిన ప్రాంతాన్ని ఫారెస్ట్ రేంజర్ సుదర్శన్ రెడ్డి పరిశీలించారు. ఆయన వెంట డీఆర్వో గౌస్‌కరీమ్, పర్యటక కేంద్రం చైర్మన్ కుమార్ ఉన్నారు.


ఏనుగుల దాడిలో ధ్వంసమైన అరటి చెట్లు


ఏనుగులు తొక్కి నాశనం చేసిన వరి పైరు

రైతు గజగజ

పాకాల: పంట పొలాలపై ఏనుగులు విరుచుకుపడుతున్నాయి. శుక్రవారం రాత్రి మండలంలోని మద్దినాయనపల్లి గ్రామానికి చెందిన ఆర్.అర్జునయ్య, ఆర్.రామచంద్రయ్యకు సంబంధించిన మూడు ఎకరాల వరి, మామిడి చెట్లు, కొబ్బరి చెట్లు, అరటి చెట్లను ఏనుగులు తొక్కి నాశనం చేశాయి. ఇరువురు రైతులకు సుమారు రూ.2 లక్షలకుపైగ నష్టం వాటిల్లినట్టు స్థానికులు పేర్కొన్నారు.

వీళ్లంతే..మారరంతే!



తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని అధికారుల తీరు రోజురోజుకూ తీసికట్టుగా మారుతోంది. బస్టాండ్‌కు దక్షిణం వైపు ఉన్న ముఖ ద్వారం ముందు భాగంలో విశాలమైన ఖాళీ స్థలం ఉంది. 100 నుంచి 150 వరకు ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేసుకోవచ్చు. తమ బంధువులు, స్నేహితులను బస్సు ఎక్కించడానికి వచ్చి వెళ్లేవారంతా ఆ ప్రాంతంలో గతంలో 10 నుంచి 20 నిమిషాలపాటు పార్కింగ్ చేసుకునే వారు. అయితే కూటమి సర్కార్‌లో కొందరు అధికారులు ఆ స్థలం చుట్టూ కంచె వలే ఇనుపరాడ్లు ఏర్పాటు చేశారు. ఆపై కొందరు ఆర్టీసీ అధికారులు.. వ్యాపారుల కార్లు మాత్రమే అందులో పార్కింగ్ చేస్తున్నారు. ఈ విషయంపై తిరుపతి బస్టాండ్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడును వివరణ కోరగా పొరబాటును ఎవరైనా కంచె ఏర్పాటు చేసి ఉండొచ్చని, పరిశీలించి తొలగిస్తామన్నారు. ఆర్టీసీ అధికారుల వాహనాలు పార్కింగ్ చేసుకోవడానికి ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించలేదన్నారు. – తిరుపతి అర్బన్